క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



ఊయలసేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై నంద్యాలకు చెందిన కొదండరామ భజన మండలి వారి భజన కార్యక్రమం అలరించింది. గణపతిప్రార్థన, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, మహేశ పాపవినాశ, శివశివ శంకరా, శంభో హరహర, కైలాసవాసుని మొదలైన పలు భక్తి గీతాలను, భజన కీర్తనలను బాలపుల్లయ్య, చిన్నరామపుల్లయ్య, నరసింహుడు, పెద్దరామపుల్లయ్య, ప్రసాదు ఆలపించారు.

నట్టల నివారణ మందు పంపిణీ



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న దృశ్యం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సింగవరం, పరమటూరు గ్రామాల్లో శుక్రవారం వెటర్నరీ డాక్టర్లు అనూష, జ్యోత్స్నల ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నట్టల నివారణ మందు తాపడం వల్ల జీవాల్లో రక్తహీనత తగ్గతుందన్నారు. జీవాలకు వాటి యజమానులు కచ్చితంగా నట్టల నివారణ మందు తాపించాలని సూచించారు.

నేడు కుక్కలకు టీకాలు

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశువుల ఆసుపత్రిలో కుక్కలకు యాంటీ రాబిస్ టీకా వేయనున్నారు.

ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని బైరెడ్డి నగర్‌కు చెందిన కృష్ణయ్య ఆచారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యూత్ గ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, యూత్‌వింగ్ పట్టణ అధ్యక్షులు లడ్డూ, కౌన్సిలరు అల్లూరు కృష్ణ చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మాబాషా, బాషా, జావీద్, అబ్దుల్లా, నూర్, కలాం తదితరులు ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నందికొట్కూరు: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా కార్యదర్శి దినేష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని నంద్యాల రోడ్డులో సంఘం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ విద్యనభ్యసించడానికి ఆటంకంగా మారినా జీవో 77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం విద్యార్థులు మహిమ, రాజు, మన్నీ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆశల సాగు

రెండు రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తుండటంతో అన్నదాతలు ఆశల సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసి ఉంచుకున్న రైతన్నలు మొక్కజొన్న, పత్తి తదితర విత్తనాలు వేసే పనుల్లో బిజీ అయ్యారు. ముందస్తు వర్షాలకు విత్తు వేసిన పొలాల్లోని పైర్లు జూన్ నెలలో తీవ్ర వర్షాభావం కారణంగా వాడు ముఖం పట్టడంతో అన్నదాతలు కాస్త ఆందోళన చెందినా.. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పైర్లు జీవం పోసుకుంటున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కూటమి ప్రభుత్వం మాత్రం పెట్టుబడులకు కానీ, విత్తనాలు, మందులకు కానీ ఎలాంటి సాయం చేయకపోవడంతో రైతులు అప్పు చేసి ఆశలా సాగును ప్రారంభించారు. ప్రకృతి కరుణిస్తే అప్పు తీర్చుకోవచ్చనే ధైర్యంతో ముందడుగు వేస్తున్నారు.

- జోరుగా వర్షాలు.. విత్తు పనుల్లో రైతన్నలు
- ముందస్తు సాగు చేసిన పైర్లకు జీవం



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఆత్మకూరు: ఈ యేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం గాక ముందు నుంచే వర్షాలు విస్తారంగా కురిశాయి. ఎండాకాలంలో వర్షాకాలాన్ని తలదన్నేలా వర్షాలు కురవడంతో రైతులు ఉరుకులు పరుగుల మీద వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లు, ఎడ్లతో పొలాలను దుక్కిదున్ని చదును చేసుకున్నారు. ఎరువులు చల్లి విత్తు వేసేందుకు సిద్ధమయ్యారు. ఊహించనివిధంగా ఏప్రిల్ నెలలో సాధారణ వర్షపాతం కేవలం 21 మి.మీ. కాగా, రికార్డుస్థాయిలో దాదాపు పదింతలకు పైగా వర్షాలు కురిశాయి. 129 మి.మీ. వర్షం కురవడం, మే నెలలో సాధారణంగా 26 మి.మీ. వర్షాలు కురవాల్సి ఉండగా అంతకు పది నుంచి 12 రెట్లు అత్యధికంగా 135 మి.మీ. వర్షం కురిసింది. ఈ వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో రైతులు మొక్కజొన్న, పత్తి, కంది, మెట్ట వరి పంటలను 20 శాతానికి పైగా సాగు చేశారు. తర్వాత దాదాపు 20 రోజులకు పైగా జూన్ నెలలో చినుకు జాడ కనిపించకపోవడంతో పైర్లు కళ్ల ముందే వాడు ముఖం పట్టడంతో రైతులు తల్లడిల్లారు. కానీ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కాస్త ఉపశమనం కలిగించాయి.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

ఆత్మకూరు డివిజన్‌లో జూలై నెల 1వ తేదీ నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్ ఊపందుకుంది. భూమిలో తేమ శాతం అధికం కావడంతో రైతులు తిరిగి మొక్కజొన్న, పత్తి, మెట్ట వరి పంటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే 70 శాతం సాగులో ఉన్న భూములు వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. కేవలం ఇప్పటి వరకు 6 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2 వేల ఎకరాల్లోపు పత్తి, 4 వేల ఎకరాల్లో మెట్ట వరి పంట, 500 ఎకరాల్లో కంది పంటను సాగుచేశారు. ఇంకా దాదాపు ఆత్మకూరు డివిజన్‌లో 20 వేల ఎకరాల్లో ఇంకా రైతులు విత్తు వేయనున్నారు. ప్రస్తుతానికి ఎండుతున్న పంటలకు ఊపిరి పోయడమేగాకుండా ఇంకా విత్తు వేయని పంటల్లో తిరిగి విత్తు వేస్తూ రైతులు ఖరీఫ్ పనులు చేస్తూ ముందుకు సాగుతున్నారు.

పంటలకు ఊపిరి



మూడు ఎకరాల్లో మొక్కజొన్న ముందుగానే సాగు చేశాను. తర్వాత వాన రాకపోవడంతో ఎండిపోతుందని భయమేసింది. పంటను చెడగొట్టాలనుకున్న సమయంలో వానదేవుడు కరుణించాడు. రెండు రోజులుగా కురుస్తున్న వానలతో మొక్కజొన్న పంటలకు ఊపిరి పోసినట్లుయింది.

– భూషన్న, రైతు, సిద్ధపల్లి.

మొక్కజొన్న విత్తుతున్నాం



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి పదునెక్కింది. దీంతో నాకున్న పది ఎకరాల భూమిలో మొక్కజొన్న పంటను విత్తుతున్నాం. కూలీల ద్వారా విత్తనం నాటిస్తున్నాం. ఇది మంచి అదును అందుకే మరో రెండు రోజుల్లో మిగతా పొలాల్లో కూడా విత్తనం వేస్తాం.

– శేషన్న, రైతు, కరివేన గ్రామం

బహుమతుల ప్రదానం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

ఆత్మకూరురూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులకు శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ బహుమతులు అందజేశారు. సమాజంలో విస్తరిస్తున్న ×మాదకద్రవ్యాలు, అశ్లీలతను అరికట్టడం ఎలా? అంశంపై ఇంగ్లీషు, తెలుగు భాషల్లో నిర్వహించిన పోటీల్లో 9, 10 తరగతులకు చెందిన 35 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు జూనియర్ సివిల్ జడ్జి బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: విప్లవ వీరుడు, మన్యందొర అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు బాలు, కె.రాజన్న, ఎం.పద్మ, ఎస్.మహేశ్వరరెడ్డి, ఇందిరా ప్రియదర్శిణి, పూర్ణేశ్వరరెడ్డి, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



మొక్కలు నాటిస్తున్న వ్యవసాయి, ఉద్యానశాఖ అధికారులు

పాములపాడు: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి హరిచందన తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు ఏడాది వయస్సు ఉన్న 57 మొక్కల చొప్పున రైతులకు ఉచితంగా అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. హెక్టారుకు ఏడాదికి రూ.10,500 చొప్పున ఆర్థిక సాయం అందుతుందన్నారు. నాలుగేళ్ల నుంచే గెలలు దిగుబడి ప్రారంభమై రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు మొక్కలను అందజేసి, పొలంలో నాటించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి, పతంజలి డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వంద రోజుల ఉపాధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

వెలుగోడు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ వంద రోజులు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అబ్దుల్లాపురం గ్రామంలో సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి పథకంలోని వేతన దారుల హక్కులు గురించి, సౌకర్యాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వలసల నివారించేందుకు ఉపాధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పనుల్లో పారదర్శకత కోసం ఏడాదికి ఒకసారి సామాజిక తనిఖీ చేపట్టి.. వివరాలను గ్రామ సభలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం రేగడగూడూరు, గుంతకందాల గ్రామాల్లో అధికారులు పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓఆర్‌డీ మురారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు



స్వల్పంగా గాయపడిన నాగలక్ష్మమ్మ

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలో శుక్రవారం సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించాయి. గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ ఉదయం ఉదయం గ్యాస్ స్టవ్ ఆన్ చేసి వంటకు చేసేందుకు యత్నించగా గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. ఇంట్లో నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి కాలిపోయాయి. నాగలక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు సిలిండర్‌ను బయటకు తెచ్చి లీకేజీని నివారించటంతో ప్రమాదం తప్పింది.

రేషన్ సరుకులు అందించాలి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని మణికంఠపురం గ్రామస్తులకు రేషన్ సరుకులు అందించాలని వ్యవసాయ కార్మిక నాయకులు శుక్రవారం తహసీల్దార్ పద్మావతిని కలిసి వినతి పత్రం అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే పంపిణీ చేయాల్సి ఉండగా సిబ్బంది పట్టించుకోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, సుబ్బరాయుడు, సీపీఎం నాయకులు రత్నమయ్య ఫిర్యాదు చేశారు.

పంటలకు బీమా చేయించుకోండి

వెలుగోడు: సాగు చేసిన ప్రతి పంటకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి స్వాతి రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశమై ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మహానందిలో కడప జిల్లా స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌ఓ పూజలు



మహానంది: అటవీశాఖ కడప జిల్లా స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్ రెడ్డి శుక్రవారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనకు ముందుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

పైపులు లీకేజీ.. వాహనదారులకు ఇబ్బంది



పైపులు లీకేజీతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామ రైతులు పొలాలకు నీరు పారించేందుకు ఏర్పాటు చేసుకున్న పైపుల లీకేజీ అయ్యి రహదారిపై పారుతున్న నీరు ప్రజలకు ప్రమాదకరంగా మారింది. భవనాశి నది ఒడ్డున నందీశ్వరాలయం సమీపంలో రైతులు సాగు నీటి కోసం ఎస్ఆర్‌ఎంసీకి మోటార్లు ఏర్పాటు చేసుకుని భూమిలో పైపులు ఏర్పాటు చేసుకున్నారు. రహదారి కింద భూమిలో ఉన్న పైపులు లీకవుతూ నీరు వృథాగా పారుతోంది. రహదారి వెంట నీరు పారుతుండటంతో బాటసారులకు ఇబ్బందిగా మారింది. రహదారి చిత్తడిగా మారి పలువురు ద్విచక్రవాహనాల నుంచి కిందపడి స్వల్పగాయాలైన ఘటనలు లేకపోలేదు. నీరు లీకవుతున్న ప్రాంతంలో బీటీ రహదారి సైతం కొంత మేర దెబ్బతింది. పొలాలకు నీరు పారించేందుకు ఏర్పాటు చేసుకున్న పైపుల లీకేజీని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కొత్తపల్లి: ఈనెల 9న చేపట్టే జాతీయ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.సంజీవరాయ కోరారు. సమ్మెలో పాల్గొనాలని వారు శుక్రవారం సింగరాజుపల్లి, శివపురం గ్రామాల్లో హమాలీలు, రైతులు, వ్యవసాయ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు దేవకుమార్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రేపు తొలి ఏకాదశి పూజలు

మహానంది: ఈనెల 6న మహానందిలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని శుక్రవారం తెలిపారు. కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకాలు, తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్లకు ఫలాలు నివేదనగా సమర్పిస్తామన్నారు. గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, రాజగోపురంతో సహా అన్ని గోపురాలను మూలికా ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

శాకాంబరిదేవిగా పార్వతీమాత



ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలోని పార్వతీ మాత శుక్రవారం శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహానంది రాజగోపురం వద్ద నల్లనాగు



మహానంది: మహానంది దేవస్థానంలోని రాజగోపురం ఆలయ మహాద్వారం ముందు గురువారం రాత్రి నల్ల నాగుపాము ప్రత్యక్షమైంది. విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నాయక్, సిబ్బంది పామును గుర్తించడం, భక్తులు లేని సమయంలో నాగుపాము రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సన్మానం



మహానంది: బదిలీపై వెళ్తున్న తమ్మడపల్లె మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, రాఘవేంద్రమ్మలను ఎంఈఓ రామసుబ్బయ్య, హెచ్‌ఎం రామపక్కిరెడ్డి, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

పల్లకీసేవ రద్దు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమం రద్దు చేసినట్లు వేద పండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ఆలయ పరిసరాల్లో వర్షం కురుస్తున్న కారణంతో పల్లకీ సేవను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన బెస్త సుదర్శన్ (27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. సుదర్శన్ పక్షవాతంతో రెండుకాళ్లు సచ్చుపడిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి



బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మాస్ లైన్ జిల్లా నాయకులు వేల్పుల అర్లప్ప డిమాండ్ చేశారు. ఈనెల 9న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్న సందర్భంగా శుక్రవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుగుణాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాయకులు బీబీ, లక్ష్మీదేవి, ముర్తుజాబి, కార్మిక సంఘం నాయకులు రమేష్, సోమన్న, నరసింహుడు, గాబ్రియేల్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- ఆర్డీఓ నాగజ్యోతి



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ నాగజ్యోతి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు హెచ్చరించారు. ఆర్డీఓ కార్యాలయంలో లింగనిర్ధారణ పరీక్షలు, వాటి చట్టాలపై అధికారులతో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి, సూపర్‌వైజర్ మస్తానయ్య పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమ్మర్

ఆత్మకూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ ఉమ్మర్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని క్రిష్టాపురం, అమలాపురం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు, కుళాయిల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలునాయక్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

మోడల్ విద్యార్థులకు బస్సుల కష్టాలు



కిక్కిరిసిన బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు

మహానంది: మండల కేంద్రం ఎం తిమ్మాపురం ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులను బస్సుల కష్టాలు వేధిస్తున్నాయి. 450 మంది విద్యార్థులకు రెండు బస్సులు మాత్రమే ఉండడంతో ప్రయాణం కష్టతరంగా మారింది. ఒక్కో బస్సులో సుమారు 140 మంది వరకు ప్రయాణం చేస్తుండడంతో ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి బస్సు సర్వీసులను పెంచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యం



అన్నా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్

నంద్యాల: తక్కువ ధరతో నిరుపేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా ఆసుపత్రి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం ఏఏ ఆహారపదార్థాలు వడిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ నిర్ణీత రుసుం రూ.5 చెల్లించి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ నరసింహులు

డోన్: చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ నరసింహులు హెచ్చరించారు. సెంటర్లు సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనటల్ డైగ్నోస్టిక్స్ టెక్నిక్స్ (PCPNDT) యాక్ట్ పరిరక్షణలో భాగంగా మల్టీ మెంబర్ అడ్వైజరీ అథారిటీ కమిటీ సమావేశం శుక్రవారం డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్లు తమ లైసెన్సులు కాలపరిమితి ముగిసిన వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. చట్టవిరుద్ధంగా స్కానింగ్‌లు జరుపుతున్న సెంటర్లకు ముందుగా నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోపణలు రుజువైతే ఆసుపత్రులను మూసివేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. కమిటీ చైర్మన్ డాక్టర్ చెన్నకేశవులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ సలీమా, న్యాయవాది మధుసూదన్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు మహమ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, మధు, డిప్యూటీ హెల్త్ అధికారి రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.